# అమూల్య క్షణాలు

సైనికాధికారి పిల్లలు చదువులు కుదురుగా ఒకేచోట సాగవు. ఇవాళ ఇక్కడ, రేపు అక్కడ అన్నట్టుంటుంది జీవితం. కొత్త బడులు, కొత్త టీచర్లు, సరికొత్త వాతావరణం, మార్పు నాకు అలవాటే. కొత్తగా వచ్చిన పిల్లలంటే పాతవాళ్లకీ అలుసూ, హేళన. అదీ నాకు అలవాటే. కానీ ఆ రోజు శృతి మించి సాగుతున్న ర్యాగింగ్ చూస్తూ ఉంటే నాకు మెడిసిన్‌లో సీటు వచ్చిందన్న ఆనందమంతా ఆవిరైపోయింది. హాస్టలులోని సీనియర్స్‌కి చెలగాటం, మాబోటి జూనియర్స్‌కి ప్రాణ సంకటంగా ఉంది. దొంగలు ఊళ్లు పంచుకున్నట్టు ఒక్కో కొత్తవాడిని ఒక్కో పాత విద్యార్థి ఎంచుకుని ఆట పట్టిస్తున్నాడు.

వాడు ఆడమంటే ఆడాలి, పాడమంటే పాడాలి. నేలమీద ప్రాకమంటే ప్రాకాలి. ఇచ్చిందేదైనా తినాలి, త్రాగాలి. సాటివాడి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించి సామూహికంగా వేడుక జరుపుకోడం పైశాచికమనిపించినా ఏమీ చెయ్యలేకుండా తలవంచుకునే పరిస్థితి నాది. ర్యాగింగ్ చేస్తే కొత్తవాళ్లలో బెరుకుతనం పోయి పాలూ నీళ్లలా కలిసిపోతారన్న వాదనకు ఊత ఇచ్చి సమర్థించేవాళ్లు కొందరు లేకపోలేదు.. గుర్తింపు పొందడానికి అంతకన్నా సులభమార్గం మరిలేదేమో ?

ముందుగా రాసి పెట్టిన చీటీలు ఒక డబ్బాలో వేసి గిలకరించి కిందపోసి ఒక్కొక్కరి చేతా ఒక్కో చీటీని తీయించి, అందులో రాసిపెట్టిన ఆజ్ఞను అమలు చేయిస్తున్నారు. పులికోరల్లో చిక్కుకున్న లేడికూనల్లా, 'మా' భాగ్యమెట్లున్నదో' అన్నట్టు బిక్కుబిక్కుమంటూ మేం నిలుచున్నాం. నేను తీసిన చీటిని విప్పి చదివాను. నోట్లో కళ్లెంలాగా ఒక తాటిని నా పళ్లతో పట్టుకుని హాస్టలు చుట్టూ పదిమార్లు గుర్రం దాట్లు వేసుకుంటూ పరిగెట్టాలని నా చీటిలో ఆజ్ఞ జారీ అయింది. నన్ను పరిగెత్తించే సీనియర్ పేరు రాహుల్. వాడి చేతిలో ఒక కొరడా ఉంది.

ఒకమారు పరుగుతీసి ఒగరుస్తూ వుంటే నన్ను నిలిపి నా వీపు మీద చేత్తో నిమిరి ఆశ్చర్యపరచాడు. "నేను నీలా ఇక్కడకు వచ్చినవాణ్ణే. ఇవ్వాళ ఉదయమే తప్పించుకుపోదామంటే ఎవడో వచ్చి అడ్డుకున్నాడు." అన్న అతని మాటలు, ఎండి బీటలు వారిన భూమ్మీద తొలకరి జల్లులా కురిశాయి. నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. చదువుకోవాలన్న ఆశ కలిగింది. అలా రాహుల్‌తో నా తొలి పరిచయం నాటకీయంగా జరిగింది.

రాహుల్ వచ్చింది సామాన్యమైన మధ్యతరగతి కుటుంబంలోంచి. తల్లీ తండ్రీ కూడా చేస్తున్నది ఉపాధ్యాయవృత్తి. కొడుకు యోగక్షేమం కనుక్కోడానికి వచ్చి నాలుగు రోజులు ఎవరో బంధువుల ఇంట ఉన్నారు. ఉన్న నాలుగు రోజులూ నన్నూ రాహుల్‌తో సమంగా తమతో తిప్పుకున్నారు. ఒక ఆదివారం ఆఘాఖాన్ ప్యాలెస్‌కు తీసుకెళ్లి మాకు తెలియని విషయాలెన్నో చెప్పి మన నాయకులు స్వాతంత్ర్యాన్ని ఎంత కష్టపడి సంపాదించారో వివరించారు. అలా బలపడిన మా ఇద్దరి స్నేహంతో నేను ఒంటరిని కానన్న భావం నాలో స్థిరపడింది. ఎవరి చదువూ బాధ్యతల్లో వాళ్లం మునిగినా తరుచూ పలకరింపులు కొనసాగేవి.

ఎమ్.జి.రోడ్డుమీద ఒక సాయంత్రం కలిసినప్పుడు "ఏమైంది ఆదిత్యా ! అలా డీలా పడిపోయావ్ ?" అన్నాడు. రాహుల్ చూపు ఎంత నిశితమైంది ? అనుకున్నాను. నిజానికి ఆ రోజు చాలా బాధగా ఉంది మనసులో. తాతయ్య పోయాడని అమ్మ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. అదేమాట రాహుల్‌తో చెప్పాను.

ఎంత వయస్సు ? అని అడిగాడు.

డెబ్భై మూడు ....... అన్నాను.

విని వేదాంతిలా నవ్వాడు. "నిన్ను బాగా ప్రేమగా పెంచినట్టున్నారు. నీకోసం కూర్చుంటే ఆ వయసులో వున్న ముసలి వాళ్లకెంత కష్టం ?" అన్నాడు. ఇక సిగ్గుపడి మా తాత గురించి వివరంగా చెప్పలేక మౌనంగా ఉండిపోయాను. కానీ రెండు మూడు రోజులు మా తాత జ్ఞాపకాలే నన్ను వెంటాడాయి.

మా మధ్య తాతా మనవడి కుండె బాంధవ్యమే కాక గురుశిష్య సంబంధం లాంటిది కూడా ఉంది మరి. నాన్నగారికి దేశం పొలిమేరల్లో ఫీల్డ్ పోస్టింగ్ అయిన రోజుల్లో నేనూ అమ్మా తాతగారింటనే గడపవలసి వచ్చింది. నాన్నగారు అప్పుడప్పుడు వచ్చి వెళ్ళడమే తెలుసు. తాత అప్పుడు నా చేత తెలుగు అక్షరాలు దిద్దించి చిన్న చిన్న కథలు చెప్పేవాడు. మార్కండేయుడు, ధ్రువుడు, శిబిచక్రవర్తి కథలు అప్పుడు చెప్పినవి జ్ఞాపకం ఉండేవి. ఆ తర్వాత నాన్నగారితో అమ్మతో కలిసి ఉత్తర భారతం అంతా తిరుగుతూ తెలుగుభాష మరచిపోతానేమో అని తరచూ నాకు తాత తెలుగులో ఉత్తరాలు రాస్తూ పుట్టినరోజు వస్తే కథల పుస్తకాలు పంపుతూ వుండేవాడు. అందుకే తాతని మరవడం నాకు సులభం కాలేదు.

***

కాలప్రవాహంలో దినాలు, వారాలూ, నెలలూ దొర్లిపోతుంటే నేనూ రాహుల్ మా చదువు బాధ్యతల్లో పడిపోయాము. తాతపోయిన దుఃఖం క్రమంగా దూరమైంది. నేను ఒంటరినన్న బెరకుతనం కూడా రాహుల్ పలకరింపులతో కాసింత దూరమై ఆత్మవిశ్వాసం చోటుచేసుకుంది. కానీ కాలం దాని వేగంతో ఎన్నో మార్పులు తెచ్చిపడేస్తుంది కదా.

సీనియర్ కావడం వల్ల రాహుల్ నన్ను పూనాలో విడిచిపెట్టక తప్పలేదు. ఢిల్లీలో బేస్ హాస్పిటల్‌లో ఇంటర్న్‌షిప్‌కి వెళ్లిన తర్వాత అప్పుడప్పుడు ఉత్తరాలు రాసేవాడు. ఆ తర్వాత ఆర్మీ అధికారుల కోసం లక్నోలో నడిపే బేసిక్ కోర్స్‌కి వెళ్లినట్టు కూడా ఒక ఉత్తరం రాసినట్లు గుర్తుంది. క్రమంగా ఎవరి బాధ్యతల్లో

వాళ్లం మునిగిపోయిన కారణంగా ఉత్తర ప్రత్యుత్తరాలు సన్నగిల్లాయి. పూనాలో నా చదువు కూడా ముగిసింది.

* * *

సికింద్రాబాద్ మిలిటరీ హాస్పిటల్‌లో నా ఇంటర్న్‌షిప్ పూర్తి అయిన తర్వాత అఖ్నూర్ రోడ్‌లో ఉన్న ఫీల్డ్ యాంబులెన్స్‌కి పోస్టు చేశారు నన్ను.

ఒంటరితనం మళ్లీ నన్ను వేధిస్తున్న సమయంలో మా పినతల్లి ఢిల్లీ నుంచి వచ్చింది. శ్రీనగర్ చూడాలంది. ఆర్మీ బస్‌లో ఉదయమే జమ్మూ నుంచి బయలుదేరాం. మధ్యాహ్న భోజనం వేళకు రాంబన్ ట్రాన్సిట్ కాంప్ చేరుకున్నాం. భోజనమైనాక మా బస్సు బయలుదేరడానికి అర్ధగంట వ్యవధి ఉంటే నేనూ మా పిన్నీ జీలం నదిలో ఉరకలేస్తున్న నీటి వేగాన్ని చూస్తూ మాట్లాడుకుంటున్నాం. "ఆ ఏనుగు గున్న నీటిలో ఎలా స్నానం చేస్తున్నదో చూశావా ? నీటి వేగానికి కొట్టుకు పోదూ ?" అని ఆశ్చర్యంగా అడుగుతోంది. నాకు పెద్దగా నవ్వు వచ్చింది. పిన్ని పొరపాటుకు తగిన కారణం లేకపోలేదు. ఒక నల్లటి రాయి తరరాలుగా ఆ జీలం నదిలో ప్రవాహంలో నునుపుతేరినట్టుంది. చిన్న ఏనుగు గున్న ఆకారంలో రూపుదిద్దుకుని చూసేవాళ్లకి అలాటి భ్రమ కల్గిస్తోంది.

ఇంతలో హల్లో ఆదిత్యా ! అన్న పిలుపు నా వెనుకనుంచి వినిపించి ఆశ్చర్యంగా అటు తిరిగాను. నన్ను చూసి నవ్వుతున్న రాహుల్ దర్శనమిచ్చాడు. నా పినతల్లికి పరిచయం చేస్తూ వుంటే వినయంగా ఒంగి ఆమె కాళ్లను స్పృశించాడు. మా పిన్ని ఎంతో ప్రసన్నంగా అతని తలను చేత్తో తాకి దీవించింది. పెళ్లయిందా ? అని పిన్ని తెలుగులో నన్నడగిన ప్రశ్న విని "ఆంటీ ఏమడుగుతున్నారు ?" అన్నాడు. నా వివరణ విని నవ్వుతూ "మేం నిశ్చింతగా బ్రతుకుతూ వుంటే పెద్దవాళ్లకు తోచదు కదా ! నేను శలవుమీద ఇంటికే వెళ్లివస్తున్నాను. సంబంధం నిశ్చయం చేశారు" అన్నాడు.

మరి నేనూ భాభీని చూడవద్దూ అనేలోగానే తన పర్స్ తీసి ఫోటో చూపించాడు. అమ్మాయి సుకుమారంగా అందంగా ఉంది. మా పిన్ని కూడా చూసి ముచ్చటపడి దండిగా మార్కులు వేసింది.

ఇంతలో మా ఆర్మీ బస్ బయలుదేరడానికి సిద్ధంగాఉందని తెలిసి రాహుల్‌కు వీడ్కోలు చెప్పి వచ్చాము. బారాముల్లా సెక్టర్‌లో రెజిమెంటల్ మెడికల్ ఆఫీసర్‌గా ఉంటున్నానని తన అడ్రసును చీటీలో రాసి నా చేతి కందిస్తూ వుంటే బస్సు కదిలింది. కానీ నా ఆలోచనలు వెనక్కు వెళ్లాయి. పూనాలో మా ఊహలు విచిత్రంగా ఉండేవి. ఇన్ని దేశాల్లో ఇందరు మేధావులు ఉన్నారే. వీళ్లంతా ఏకమై యుద్ధాలకు మారుగా ప్రత్యామ్నాయ మార్గమేదైనా ఎందుకు కనిపెట్టలేకపోతున్నారో ...... అనేవాడు రాహుల్. ఆర్మీ మెడికల్ కాలేజీలో చదువుతూ యుద్ధాలు, సైన్యాలు అవసరం లేని సమాజం, వ్యవస్థా కావాలని కోరుకోవడమే నాకు నవ్వు తెప్పించేది. అప్పట్లో అంతగా ఉగ్రవాద ధోరణి లేదు కానీ ఛాయా మాత్రంగా దేశపు పొలిమేరల్లో కనుపించేది.

* * *

జమ్మూ మిలిటరీ హాస్పటల్‌లో ఏదైనా క్లినికల్ మీటింగ్‌లకు వెళ్లినప్పుడు ఎవరైనా బారాముల్లా వాళ్లు కలవడం తటస్థిస్తే మేజర్ రాహుల్ గురించి అడిగేవాణ్ణి. అతని గురించి ఎవర్నడిగినా ప్రశంసలు కురిపిస్తూ చెప్పేవారు. ఎప్పుడైనా నేను రెండు రోజులు శలవుపెట్టి బారాముల్లా వెళ్లి సరదాగా ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ గతాన్ని నెమరువేసుకుంటూ రాహుల్‌తో గడపాలని అనుకుంటూ వుండగా అలాటి అవకాశం ఒకరోజు సాధికారికంగానే వచ్చిపడింది.

కుప్వాడాకు ఒక నెలరోజులు టెంపరరీ డ్యూటీ మీద డాక్టర్‌ని పంపవలసిన అవసరం ఉంది. నిన్ను పంపిస్తున్నాను అన్నాడు ఒక సాయంత్రం మా కమాండింగ్ ఆఫీసర్. వినయపూర్వకంగా అలాగే సర్, వెళ్తాను అన్నాను. కుప్వాడాకి బారాముల్లా ఏమంత దూరం కాదు. ఏదో ఒక రోజు మధ్యాహ్న విరామం తర్వాత రాహుల్‌కి ఎదురుపడి ఆశ్చర్యపరచాలని నా మనసులో కోరిక చిగురించింది.

నాలుగురోజులు డ్యూటీ చేశాక అనుకున్నట్లే ఒక మధ్యాహ్న భోజనం ముగించి బారాముల్లా మెడికల్ ఎగ్జామినేషన్ రూమ్‌కి చేరుకున్నాను. అక్కడ అలుముకున్న వాతావరణం ఊహించలేనంత గంభీరంగానూ విషాదభరితం గానూ ఉంది. ఆ

నిశ్శబ్దాన్ని భరించలేక మేజర్ రాహుల్ సాబ్ ఎక్కడ ? అని అక్కడున్న ఒక జవాన్‌ని పిలిచి అడిగాను. పిడుగులాంటి వార్త అందించాడు. నాలో నింపుకుని తెచ్చిన ఉత్సాహమంతా ఆవిరైపోయింది. ఒక పాడుబడ్డ ఇంటిలో చేరిన ఉగ్రవాదుల ముఠా గురించి సమాచారమంది అక్కడ 'కార్డన్ అండ్ సెర్చి' జరుగుతోందట. ఆ విషయం మరచి నాయక్ జోగిందర్‌సింగ్ అనే జవాన్‌తో కలిసి అటువేపుగా రాహుల్ వెళ్తున్నాడట. ఆ ఇంటి కిటికీలోంచి రెండు బుల్లెట్‌లు ఇద్దరినీ గాయపరిచి వాళ్ల శరీరాల్లోంచి దూసుకుపోయాయట. ఆత్రంగా ఆ మాటలు వింటున్న నేను వాళ్లెక్కడున్నారని అడిగాను.

నన్ను నేను పరిచయం చేసుకున్న వెంటనే సహాయక్ వినయంగా హెలీపాడ్ దిశగా తీసుకుని పోతూ దారిలో ఎన్నెన్నో వివరాలు అందించాడు. గాయపడ్డ ఇద్దర్నీ అంబులెన్స్‌లో హెలిపాడ్‌కి తీసుకువెళ్లి శ్రీనగర్ బేస్ హాస్పటల్ నుంచి రావలసిన హెలికాప్టర్ కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు.

మేజర్ సాబ్‌కి బలమైన గాయమే అయ్యింది. అయినా దాన్ని పట్టించుకోకుండా జోగిందర్‌సింగ్‌కి ప్రథమ చికిత్స చేసి, బులెట్ చేసిన గాయానికి రెండువైపులా మూసి కట్టుకట్టి సూదిమందిచ్చాడు" అన్నాడు, మనసులో రాహుల్ పట్ల ఉన్న ప్రశంసాపూర్వక భావాన్ని కళ్లలో మెరిపిస్తూ.

"జోగిందర్‌కి గాయం ఎక్కడ అయ్యింది" నా ప్రశ్న.

"కుడివైపు ఛాతీ అంచులో"

"మరి రాహుల్ సాబ్‌కో ?"

"మేజర్‌సాబ్‌కి తొడలోంచి దూసుకుపోయింది".

"జోగీందర్ మాట్లాడుతున్నాడా ? స్పృహ ఉందా ?"

"జీ సాబ్ !"

నేను హెలీపాడ్ చేరుకునే సరికి అందరి దృష్టి ఆకాశం వంక ఉంది. రాహుల్ పక్కకు నేను హుటాహుటీ చేరుకున్నాను. కాసింత బాధగా కనుబొమలు పైకెత్తి

చిన్నగా నవ్వుతూ నువ్వు వచ్చావా అన్నట్టు కళ్లతో గుర్తించి పలకరించాడు. సరిగ్గా అదే సమయంలో హెలీకాప్టర్ వచ్చి వాలడంతో గంభీరంగా ఉన్న ఆ శిబిరంలో ఒక కెరటం లాగ సంచలనం ప్రవహించింది. పైలట్‌లు ఇద్దరూ క్రిందికి దిగి నిలుచున్నారు. కూలిన మానుల్లా పడి ఉన్న క్షతగాత్రుల్ని ఇద్దర్నీ చూస్తూనే ఏదో సందిగ్ధావస్థలో పడినట్టు ఒక్కక్షణం మౌనంగా ఉండి, పరస్పరం ఏదో చర్చించుకోవడం ప్రారంభించారు.

ప్రతి ఒక్క క్షణం ఎంతో అమూల్యమైనదే. ఎందుకీ కాలయాపన అని ఆవేశపడిపోతున్నాను. గాలికి రెపరెపలాడే దీపకళికలాటి ప్రాణాన్ని అరచేతుల మధ్య నిలిపి, వేలికీ వేలికీ సందులేకుండా బిగించి రక్షించుకోవలసిన సమయంలో ఏమిటీ వీళ్ల నిర్లక్ష్యం ? ఇంకా ఎందుకు ఆలస్యం ? అనుకుంటున్నాను. వాళ్ల మాటల మధ్య కలుగజేసుకుని ఇద్దర్నీ తక్షణం తీసుకుపోవాలని హెచ్చరించబోతూవుంటే సన్నగా పొడుగ్గా ఉన్న పైలెట్ తల అడ్డుగా వూపి "ఒకే మారు తీసుకెళ్లడం కుదరదు. రెండు ట్రిప్పులు తప్పదు" అన్నాడు గంభీరంగా మొహం పెట్టి.

అక్కడి సిబ్బంది వెంటనే స్పందిస్తూ 'మేజర్‌సాబ్ స్ట్రెచ్చర్‌ని ఎత్తండి' అని తొందరపడుతున్నారు.

ఉన్నతాధికారి ప్రాణాన్ని రక్షించుకోబోవడం సైనిక క్రమశిక్షణలో ఒక భాగమే, కానీ రాహుల్ తన చేత్తో అలా వద్దని వారించి జోగిందర్ సింగ్‌ను మొదట తీసుకెళ్లమని సూచిస్తున్నాడు. అక్కడున్న జవాన్లు సంకోచిస్తున్నారు.

ఇలా కాలయాపన జరగడం ఏ మాత్రం సహించలేక నేను పొట్టిగా లావుగా వున్న రెండవ పైలెట్ వేపు చూసి 'ఇద్దర్నీ ఎందుకు తీసుకువెళ్లరాదు ?' అని ఉద్వేగంతో నా కంఠస్వరం పెంచాను. ఆ పైలెట్ నిస్సహాయంగా నా కళ్లలోకి చూస్తూ "మీ కర్థమయ్యేలా వివరించే చెప్పే వ్యవధి లేదు కెప్టెన్ సాబ్ ! ఇదో విచిత్రమైన ఎయిరో డైనమిక్ సమస్య. వాతావరణ పీడనం బాగా తక్కువగా ఉంది. ఇంధనం ఎక్కువగా నింపితే దాని బరువూ ఇంజన్ బరువూ ఎక్కువైపోతుంది. ఇంధనం తగ్గించి రిస్క్ తీసుకోలేం కదా ! ఇలాటి సమయంలో నడపడం కత్తిమీద సాములా చాలా

సున్నితమైనది .....'' అంటూ వుంటే గుడిగంటలా ఖంగున మ్రోగిన రాహుల్ గొంతు మా మాటలకడ్డు వచ్చింది.

"ఐ సే .... ఫస్ట్ లెట్ జోగిందర్ మూవ్, నో టైమ్ టు వేస్ట్ ....'' అని కళ్లు అసహనంతో మూసుకున్నాడు.

* * *

పైలట్లు ఇద్దరూ ఇంజన్ స్టార్ట్ చేశారు. నర్సింగ్ అసిస్టెంట్ వాళ్ల ఇద్దరి సీట్ల వెనుక ఒదిగి కూర్చున్నాడు. త్రుటిలో హెలికాప్టర్ జోగిందర్‌సింగ్‌ని తీసుకుని గాలిలోకి తేలిపోయింది.

ఎయిరో డైనమిక్స్ నాకు అర్థంకాని విషయమే కానీ ఒక ఆర్మీ డాక్టరుగా ఇద్దరు క్షతగాత్రుల్నీ దగ్గరగా చూశాక నా అంచనాలూ, అభిప్రాయాలూ నాకు ఉంటాయి కదా. రాహుల్ ఎంత పెద్ద రిస్క్ తీసుకున్నాడు అని నిట్టూర్చాను.

జోగిందర్ ఛాతీ కుడివైపు అంచును తాకుతూ బులెట్ పోయిన మాట నిజమే కాని అది గుండెకు ఏ మాత్రం హానీ చెయ్యలేదని అతని ఒంటికదలికలు, మాటతీరూ చెప్తూనే ఉన్నాయి. హెలికాప్టర్‌లో ఎక్కించేదాక స్పృహలో ఉన్నాడు. రాహుల్ రక్తస్రావం అనుక్షణం నీరసించిపోతున్న పరిస్థితీ చూస్తే అతి ముఖ్యమైన ఫిమొరల్ ఆర్టరీ చిట్లిపోయినట్టు నా మనసుకి స్ఫురిస్తోంది. ఓర్పు చూపిస్తున్నాడే కానీ దేహస్థితి చాలా నాజూకుగా ఉంది. ఒక తెలివైన డాక్టర్‌గా రాహుల్‌కి ఆ మాత్రం తెలియదని నేనెలా ఊహించడం.

నిముషమొక యుగంలా బరువుగా సాగుతూ వుంటే అప్పుడప్పుడు నా దృష్టి కళ్లు మూసుకున్న నా స్నేహితుడి వేపు సారిస్తున్నాను. అంతకుమించి చెయ్యగలిగినదేమీ నాకు తట్టడం లేదు. ఇంతలో బరువైన కనురెప్పలు ఎత్తి నా వైపు ఒకమారు చూశాడు. అతని చెవికి దగ్గరగా నా తలను వంచి రాహుల్ ! నువ్వే ముందుగా శ్రీనగర్ చేరుకోవలసిన అవసరం ఉంది నువ్వు పొరపాటు ... అని నెమ్మదిగా అనబోతూ వుంటే

"నే వెళ్లిపోయివుంటే ఇలా నిన్ను కలిసి మాట్లాడే వాడినా ? కష్టపడి ..... వచ్చావు". అన్నాడు, ఎంతో శ్రమపడి నా చేతిని తన వ్రేళ్లతో తాకుతూ కళ్లు మెల్లగా మూసుకున్నాడు.

డేగలా వచ్చి వాలిన హెలీకాప్టర్ మా శిబిరంలోకి చైతన్యాన్ని ఆశనీ మోసుకొచ్చింది. రాహుల్‌ని నా చేత్తో సుకుమారంగా ఎత్తబోయాను. కాని రాహుల్ లేడు. చల్లని శరీరమే మిగిలింది.

ఈ శిబిని ఏ దేవతలు వచ్చి రక్షిస్తారన్న ప్రశ్నతో శిలలా ఉండిపోయాను.

✣ ✣ ✣

*ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక - 20 జనవరి 2001*

✣ ✣ ✣